# కృతజ్ఞత

"రాజ్యమే బ్రతికి వుంటే పాపం ఈ అమ్మాయికి ఈ గతి పట్టేదా? ఇంతకూ తల్లీ తండ్రి లేని బిడ్డ ఈ ప్రపంచంలోనే వుండకూడదు" సుబ్బాయమ్మ చెబుతుంటే జగదీశానికి సూదులు గుచ్చుకున్నట్టుంది. నిజానికి సుబ్బాయమ్మ అన్న మాటల్లో కూడా ఎంతో సత్యముంది. రమేశం పెళ్ళయిన మొదటి సంవత్సరమే చనిపోయాడు. మగడు చనిపోయిన నాలుగు మాసాలకు పురుడు పోసుకున్న రాజ్యం ఆ దిగులుతోనే పోయింది.

ఇక మిగిలింది కసుగందు. చిన్నప్పటి నుండీ తనను కన్న బిడ్డలా చూచుకున్న అన్నతో పాటు వదినె గూడా పరలోకం చేరుకోవడంతో జగదీశం సగమై పోయాడు. ఆ చిన్ని కసుగందుకు పాలివ్వడానికి దాసీని కుదిర్చి పెట్టాడు. పొలం పని మానుకున్నా కౌలుకిచ్చిన భూములైనా ఏ స్థితిలో వున్నవో చూచుకొనే బాధ్యత జగదీశం మీదనే పడింది. దీనికి తోడు వ్యాపారం ఒకటి. అన్న చనిపోయిందే దానికి గూడా విడాకులిచ్చాడు. జగదీశానికెపుడూ ఆ చిన్ని పాపాయి మీదే ధ్యాస. దాసీది వేళకు సరిగా పాలిస్తున్నదో లేదో చూచుకొనే వాడు. స్వయంగా దగ్గరుండి స్నానం చేయించేవాడు. ఆమెకు కావలసిన ఉడుపులు, సోపులు, పవుడర్ డబ్బీలు తానే స్వయంగా తెచ్చి పెట్టేవాడు.

భర్త వాలకం సుభద్రకు ఎంతమాత్రం పట్టేది గాదు. ఆమె తీరే వేరు. ఇందుకు కారణం లేకపోలేదు. ఎంతప్రేమ పొదుచుకొని వచ్చినా కన్న కూతురు మీద లేని మమత అన్న కూతురు మీద ఎందుకని ఆమె ఈర్ష్య. కన్నబిడ్డ ఏమైందో ఎక్కడుందో ఏమీ పట్టించుకోడు జగదీశం. తిండి తినడం కాగానే ఊయల తొట్టి వద్ద తయారు. ఆశ్చర్యమేమంటే బిడ్డ మలినం చేసుకొన్నపుడు గూడా తన్ను పిలవడు. తానే స్వయంగా అన్ని చేయడం చూస్తే ఆమెకు ఆశ్చర్యమూ కోపమూ ముంచుకొని వచ్చేవి. బలవంతం మీద బిడ్డను తీసుకెళ్ళి ఒళ్ళో కూచుండ పెట్టినా నిమిషం గడిచీ గడవకనే ఆ బిడ్డను తీసి తొట్టిలో పడుకోబెట్టి అన్న బిడ్డను

భుజాన పెట్టుకొనేవాడు.

చుట్టుప్రక్కల అమ్మలక్కలకు కూడా ఈ విధానం బహు చోద్యంగా వుండేది. పాపం సుభద్ర ఇరుగింటి పొరుగింటి వారికీ విచిత్రాన్ని చెప్పుకొని కన్నీరు విడిచేది.

ఆ రోజు అన్న ప్రాశనం. వారం రోజులు యించు మించు ఇద్దరు బిడ్డలూ ఒకటే యీడు గనుక ఇద్దరికీ ఒకటే లగ్నం నిర్ణయించుకున్నారు. జగదీశం అన్న కూతురుకు కావలసిన సమస్తమూ సేకరిస్తుంటే; సుభద్ర కన్న కూతురుకు కావలసిన అలంకారాలు చేసుకొంటున్నది. ఇంతవరకు నామకరణం కూడా జరిపించలేదు. ఎటూ అయ్యే ఖర్చు అవుతున్నది గనుక అన్న ప్రాశనం నామకరణం గూడా ఒకటేనాడు పెట్టుకున్నారు.

సుభద్ర తన కూతురుకు తన తల్లి పేరు పెట్టాలని పట్టుబట్టింది. భాగ్యం అనే పేరు జన్మ నక్షత్రానికి సూటిగా లేదని శాస్త్రులు చెప్పినా ఆమె వినలేదు. జగదీశం అన్న కూతురుకు లలిత అని పేరు పెట్టుకున్నాడు. అది జన్మనక్షత్రానికి సరిగా వుందని శాస్త్రులు గూడా సర్టిఫై చేశాడు.

జగదీశానికి తెలియకుండా సుభద్ర భాగ్యానికి బంగారు గొలుసు, మామిడి పిందెల మొలత్రాడు చేయించింది. జగదీశం భార్యకు చెప్పకనే లలితకు బంగారు గాజులు; బిళ్ళల మొలత్రాడు చేయించాడు. తన బిడ్డకు నగలుంటాయని, ఆ బిడ్డకు ఆభరణాలుండవని ఉవ్విళ్ళూరిన సుభద్రకు ఈ సంఘటన ఆశాభంగాన్ని కలిగించింది.

ఆ రోజు జగదీశం లలితకు స్వయంగా స్నానం చేయించి తానే ఆముదం రాచి కాటుక అద్ది, దృష్టి చుక్క పెట్టాడు. పది గంటల కల్లా ఇరుగు పొరుగు అమ్మలక్కలు వచ్చారు. చుట్టాలు ఎక్కువ మంది రాకపోయినా జనస్తోమానికి కొరత లేదు. నామకరణ మహోత్సవం వైభవంగానే జరిగింది. ఆ వెంటనే అన్నం గూడా తిన్న శాస్త్రం చేయించి ఊయలలో పడుకో బెట్టి జోలపాటలు పాడారు. జగదీశం బలవంతం చేసి లలితకు కూడా పాటలు పాడమన్నాడు.

ఆ రోజు నుండి సుభద్రకు గట్టి ద్వేషం యేర్పడి పోయింది. ఎవతో కన్న బిడ్డను ఈ విధంగా లాలిస్తూ తను కన్నబిడ్డ వైపు చూడని జగదీశాన్ని ఏమనాలో అర్థం కావడం లేదు. తెచ్చిన బిస్కత్తులు గూడా బీరువాలో పెట్టి బీగం వేసేది. జగదీశం ఎంత గింజుకున్నా ఒకటి రెండు కంటే ఎక్కువ యిచ్చేదిగాదు. ఈ

కంటకమైన ద్వేషాన్నుండి లలితను కాపాడ్డం బహుకష్టంగా కనిపించింది జగదీశానికి.

* * *

మూడు సంవత్సరాలు నిండినై లలితకు. బామ్మ నుండి అమ్మ వరకూ వచ్చినై పలుకులు. ఆ జిలిబిలి పలుకులు వింటూ... ఆ తప్పటడుగులు చూచుకుంటూ ఆనందంగా గడుపుతున్నాడు జగదీశం. ఈ ఆనందాన్ని భగ్నం చేయడానికి సుభద్ర అపుడపుడూ చిన్న చిన్న ఉపద్రవాలను తెస్తూనే వుంది. లలితను చూస్తే చాలు ఆమెకు కళ్ళలో కారప్పొడి చల్లినట్టే. ఒక్కొక్కసారి పీక మీద కాలుపెట్టి తొక్కివేద్దామన్నంత కోపం వచ్చేది. కాని బిడ్డను చంపడానికి సాహసం కావద్దూ? మరోసారి చిన్నగా కాసంత గరళాన్ని తగిలించి ఈ పీడను వదిలించుకొందామని గూడా ఆలోచించింది. అందుకైనా గుండె నిబ్బరం కావాలిగా!

"ఈ పాడు బిడ్డ ఎందుకు పుట్టిందో భూమికి బరువుగా? ఇందరికి వస్తుంది చావు ఈ ముండకు రాలేదే" అంటూ తన బిడ్డను తానే తిడుతుంటే జగదీశం చూచీ చూడనట్టు వుండిపోయే వాడు. ఈలోగా ఉగాది పండుగ వచ్చింది. సుభద్ర భాగ్యానికి చక్కని వాయిల్సు తెచ్చి రెండు గౌన్లు కుట్టించింది. జగదీశం ఒకటో రకం సిల్కు తెచ్చి మూడు గౌన్లు కుట్టించాడు. ఈ సిల్కు గౌన్లు చూడటం తోటే సుభద్రకు కళ్ళు పేలిపోయినై. జగదీశం అటు వెళ్ళాడో లేదో ఆ గౌన్లు తీసి చేద బావిలో పడేసింది. జగదీశం యింటికి వచ్చి లలితకు స్నానం చేయించి బట్టల కోసం వెతికాడు. ఎక్కడున్నాయి కనబడడానికి? "ఇక్కడున్న బట్టలేవీ" అంటూ దాసిదాన్ని అడిగాడు. దాసీది "అయ్యో! నేను చూడలేదు బాబూ!" అంటూ సమాధానం చెప్పింది. "దాన్ని అడిగిరా" అంటూ లోపలికి పంపించాడు. "అదేం వల్ల బోగలో నాకేం తెలుసునే పాడుముండా" అంటూ కసిరి కొట్టింది. జగదీశం ఏమీ మాట్లాడకుండా పాతగౌను తొడిగి వీధిలోకి తీసుకెళ్ళాడు. లలితను వెంటనే ఊళ్ళో అంగడికి వెళ్ళి కనకాంబరం బట్ట తీసి అక్కడే అరగంట కూర్చుని కుట్టించి తొడిగి మళ్ళీ యింటికి వచ్చాడు. ఈ కొత్త గౌనును చూచిందే సుభద్ర ఒళ్ళు మండిపోయింది. "ఈ సంసారం సాగేదేనా? వేలెడు ముండవి నీ కిన్ని బట్టలెందుకే" అంటూ తన కూతురు భాగ్యాన్ని దగ్గరికి లాగి దబ దబ

మంటూ బాదింది. ఆ చిన్నపాప కెవ్వుమంటూ ఏడుస్తూ వాళ్ళ నాన్న దగ్గరికి వచ్చింది. జగదీశం ఆ పాపను కుడిచంకన వేసుకొని, లలితను ఎడమ చంకను పెట్టుకొని మేడమీదికి వెళ్ళిపోయాడు. అక్కడ యిద్దరినీ కూచోబెట్టి ఆడించు కొంటూ ఉండగానే సుభద్ర దడదడ మంటూ పైకి వచ్చి ఇంక దించుదువు రానీ మూడు గూడులు" అంటూ భాగ్యాన్ని రెక్క పట్టి ఈడ్చుకొని వచ్చి పళ్లెం ముందు కూలవేసింది. దాసిది పళ్ళెంలో అన్నం తీసుకొని మేడమీదకు వస్తే జగదీశం ఆ బువ్వ తీసుకొని లలితకు తినిపించాడు. బిడ్డ తిన్నాక ఊయలలో పరుండబెట్టి అలమారులో ఉన్న గ్రామోఫోను పెట్టెను తీసి రికార్డు వేశాడు. "ఏమిటే ఈ గోల.... ఎప్పుడూ పాడుముండా" అంటూ క్రింది వసారాలో కేక పెట్టింది సుభద్ర.

జగదీశం ఆ రికార్డులు తీసివేసి ఊయలను ఆడిస్తూ కూచున్నాడు. ఈ లోగా సుభద్ర మేడమీదికి వచ్చి, జగదీశం చూస్తుండగానే పిల్లలు ఆడుకొనే బొమ్మల్ని గబగబా దొర్లించింది.

"ఎందుకీ సాధింపులు చెప్పి ఏడవరాదూ?" అన్నాడు జగదీశం. "మిమ్మల్ని ఎవరూ అడగలేదు" అంటూ మూతి విరుచుకుంటూ క్రిందికి వెళ్ళి "ఒసేయ్ సీతీ! ఈ రోజు నుండి నీవు మా యింట్లో అడుగు పెట్టవద్దు తెలిసిందా" అన్నది. "నేనేం చేశానమ్మా" అని దాసీది అంటుంటే "నీవు రాకూడదన్నాను అంతే.. ఇదో నీకీ నెలకు యివ్వవలసిన నాలుగు రూపాయలూ" అంటూ ముఖాన కొట్టింది. తనమీద పడ్డ నాలుగు రూపాయల నోట్లూ తీసుకొని సీతి జగదీశం దగ్గరికి వచ్చి బోరుమని ఏడ్చింది. జగదీశం క్షణం ఆలోచించి. "దానికేమో మంచి కాలం లేదు. నీవు పని చేస్తూనే వుండు వద్దంటే చూస్తానులే" అన్నాడు.

సీతి చక్కా పెరటిలోనికి వెళ్ళి నీళ్ళు తోడడానికి ఆరంభించింది. "పండుగ పూట ఏమిటే నీ సాధింపులు" అంటూ సుభద్ర చివ్వుమని వచ్చి దుత్తతీసి నేల మీద గభాలుమని వేసింది. ఈ చండికావతారాన్ని మేడమీద నుండి చూస్తున్న జగదీశం గబగబా మెట్లు దిగి క్రిందికి వచ్చాడు. "నీవు వెళ్ళు సీతీ" అన్నాడు. సీతి గుడ్లలో నీరు కుక్కుకుంటూ అడుగు మీద అడుగు వేసుకొని వెళ్ళిపోయింది.

జగదీశం వెళ్ళి చక్కా పడుకున్నాడు. సాయంకాలం ఆరు గంటలైనా పైకి లేవనే లేదు. సుభద్ర కూడా వంటగదిలో ముసుగు దన్నుకొని పడుకున్నది. క్రింది కూటంలో భాగ్యం ఏడుస్తున్నా పైకి లేవలేదు. ఈలోగా ప్రక్కింటి

సుబ్బాయమ్మ వచ్చి "ఏమిటే సుభద్రా దీపాలు కూడా పెట్టలేదు! సీతి ఎక్కడే?" అన్నది. "ఏం దీపాలు పెట్టకుంటే" కొంప గూబకూస్తుందా" అంటూ సుభద్ర పైకి లేచింది. వసారాలోకి వచ్చి మంచం మీద కూర్చున్నది. మేడ మీద నుండి లలిత నెత్తి భుజాన వేసుకొని జగదీశం వీధిలోకి వెడుతూంటే "మగాడు ఈ విధంగా ఎత్తిన బిడ్డను దించకుండా వుంటే సంసారం ఏం కావాలి?" అన్నది సుభద్ర. "ఐనా ఈయనకేం వెర్రే. ఎప్పుడూ దాన్ని భుజాన వేసుకొని ఊరేగు తుంటాడు" అన్నది సుబ్బాయమ్మ. "ఇంతకూ ఈ పాడుబిడ్డ ఎందుకు పుట్టిందో ఈ ఖర్మం చేసిన కడుపున" అంటూ సుభద్ర బిడ్డనెత్తి కౌగిలించుకున్నది.

రాత్రి ఎనిమిది గంటలకు జగదీశం ఇంటికి వచ్చాడు. అర్ధగంట కాచుక్కూచున్నా అన్నానికి పిలువలేదు. బిడ్డ ఆకలికి ఏడుస్తూంటే వంటగదిలోకి వెళ్ళి పాత్రలను తిరుగవేశాడు. అన్నీ ఖాళీగా వుంటే మళ్ళీ వీధిలోకి వచ్చాడు. ఆ చివరిలో వున్న అంగడికెళ్ళి ఓ రొట్టె ముక్క తీసి పాలల్లో నానవేసి చక్కెర కలిపి లలితకు తినిపించాడు. తాను ఒక టీ త్రాగి యింటికి వచ్చాడు. ఇంట్లో దీపాలన్నీ ఆరిపోయినై. తలుపు మాత్రం వారకు వేసి వుంది. లోపలకు వెళ్ళి తలుపు వేసి పడుకున్నాడు. కాని నిద్ర పట్టలేదు. కడుపులో మంటగా వుంది. లలిత మాత్రం హాయిగా నిద్రబోతూ వుంది. పాపం ఆ చిన్న పాపకేం తెలుసు. ఏనాడో తల్లీ తండ్రి చనిపోయారని. తాను ఎవరి చేతిమీదుగా బ్రతుకుతున్నదో, ఎవరు పెంచుతున్నారో ఆమెకు తెలియదు. కడుపు చల్లబడింది గనుక కళ్ళకు చల్లగా నిద్రపట్టింది.

జగదీశం మనోవీధిలో ఏదో భయంకరమైన తుఫాను రేగిపోయింది. అన్న బ్రతికి వుంటే తనకు ఈ కష్టాలు వచ్చేవి కావు. కనీసం ఒదినమ్మైనా బ్రతికి వుంటే కొంత నయంగా వుండేది. చివరికి ఈ పసిపాపను తనకు అప్పగించి వెళ్ళారు. ఈ ఆస్తిలో సగం ఈ పాపాయిదైనపుడు ఈ చిన్న బిడ్డను ఎంతో బాగా పెంచవచ్చుగా! అయినా తన భార్య వాలకం చాలా బాధాకరంగా వుంది. ఆమెతో యిక కాపురం చేయడం కష్టతరం. ఇక బిడ్డ విషయంలో ఇదివరకే ఎన్నో ఆలోచనలు పుట్టిపోయినై. ఏ కాలానికి ఎలాంటి దుర్గుణాలు పుడుతాయో ఎవరు చూచారు? అసలు బిడ్డను దక్కించుకోవాలంటే అందుకు చోటు మాత్రం యిది కాదు. ఈలాగా జగదీశం ఆలోచించుకుంటూంటే గోడ గడియారం పదకొండు కొట్టింది. ఇకలే... బండి వెడుతుంది.... స్టేషనుకు అంటూ తనకు తెలియకనే

అంతరాత్మ హెచ్చరించింది. జగదీశం పైకి లేచాడు. మేడ మీదికి వెళ్ళి టార్చిలైటు తీసుకొన్నాడు పెట్టె తీసి అందులో ఉన్న ఆరువందల రూపాయలు తీసుకున్నాడు. బిడ్డ తొడుక్కునే పాతగౌన్లు రెండు తీసుకొని క్రిందికి వచ్చాడు. కూటం వైపునకు టార్చి ఫోకస్ చేశాడు. సుభద్ర హాయిగా పడుకొని నిద్రబోతున్నది. బిడ్డ కూడా నిద్రిస్తూంది. కన్నబిడ్డను ఓ మారు కళ్లారా చూచాడు. ఆ బిడ్డమీద బట్టను సరిగా కప్పిపెట్టి బయటకు వచ్చాడు. భుజాన వున్న లలిత మేలుకొని కెవ్వుమన్నది. "జిజ్జీపో" అంటూ ఎలుగివ్వగానే ఆ పాపాయి అలాగే మెడపై వాలిపోయినది. వీధిలో ఒకటి రెండు కుక్కలు మెరుగుతూ వుంటే జగదీశం స్టేషన్ చేరుకున్నాడు. స్టేషనులో స్నేహితుడు రామనాథం కనుపించి పలుకరించాడు గాని "పాపాయి నిద్రపోకుంటే అలా తీసుకువచ్చాన'ని సమాధానం యిచ్చాడు. బండి రాగానే విజయవాడ ప్లాటు ఫారం మీదకు గబగబా వెళ్ళి బండిలో కూర్చున్నాడు.

* * *

జగదీశానికి విత్తం ఎక్కువ వున్నది కాని విద్య తక్కువే. అయినా ఆ విద్య యిప్పుడు పనికి వచ్చింది. ఉద్యోగం స్వల్పమైనదైనా జీవనానికి లోటులేదు. ఉదయం పది గంటల కల్లా భోజనం చేసి పాపాయికి పెట్టి తాను తిని ఆఫీసుకు వెళ్ళేవాడు. ఆఫీసులో పాపాయి స్వేచ్ఛగా అందరితోనూ ఆడుకుంటుండేది."తల్లి లేని బిడ్డ" అని జగదీశం చెప్పడం వల్ల ఆ బిడ్డమీద అందరికి సానుభూతి గూడా హెచ్చింది. పాపం భార్య పోయిందేమో బిడ్డను పోషించుకుంటున్నాడని నలుగురూ అనుకొనే వారు. మళ్ళీ పెళ్ళి చేసుకోరాదా అంటూ ఒకరిద్దరు హెచ్చరించారు కూడా. జగదీశానికీ మాట అన్నప్పుడు కొంత బాధగా తోచినా నెమ్మదిగా సమాళించుకొనే వాడు. బిడ్డను పోషించి పెద్దదైనాక ఒక అయ్య చేతిలో పెడితేనే గాని తన బాధ్యత తీరదని అతను తీర్మానించుకొన్నాడు. గనుక ఎవరేమన్నా నొచ్చుకొనే వాడు గాదు. తాను సంపాదించే డబ్బుతోనే జీవయాత్ర గడుపు తున్నాడు గాని యింటివద్ద నుండి ఒక్క దమ్మిడీని కూడా ఆశించలేదు సరిగదా యింటికి జాబైనా వ్రాయలేదు.

అక్కడ సుభద్ర ఒకటి రెండు రోజులు చూచింది. స్నేహితులను విచారించింది. బంధువులకు జాబులు వ్రాసింది గాని భర్త జాడే కనుపించలేదు. ఇక లాభం

లేదనుకొని వస్తున్న ఆదాయంతో సుఖంగా జీవనం చేయడం అలవాటు చేసుకొన్నది. కూతురును మాత్రం జాగ్రత్తగానే పోషిస్తూ వచ్చింది. ముందు తరిమివేసిన దాసీ దాన్ని మళ్ళీ యింటిలో వుంచుకొని తాను ఒళ్ళు కదలకుండా కాలక్షేపం చేస్తున్నది. భాగ్యం పెరిగి పెద్దవుతున్న కొద్దీ ఈ సమస్తమైన సంపదకంతా నా ఒక్క బిడ్డే గదా రాణి అంటూ మురిసి పోతూంది. దేనికైనా ముందు హుషారు మంచిదని తన అన్న బిడ్డను యింట్లోనే వుంచుకొని పెంచడం ప్రారంభించింది. వానికి విద్యా బుద్ధులు చెప్పించడానికి కూడా తానే నడుం కట్టింది. అతడు పెరిగి పెద్దవాడైతే ఆ మూడు ముళ్ళూ వేయించి కళ్ళారా చూచి కనులు మూస్తే చాలునని గంపెడాశ పెట్టుకొన్నది.

జగదీశం పనిలో ఎంత కష్టం కనుపించినా చింతించే వాడు గాదు. బిడ్డను బడిలో చేర్చి తనకు తెలిసినంతవరకూ తాను చదువు చెప్పడం ప్రారంభించాడు. నెలకు పది రూపాయల వేతనం మీద ఒక మ్యూజిక్ మాష్టారును ప్రాధేయపడి సంగీతం చెప్పించాడు కూడా. లలిత ఎంత అందమైందో అంత కంటే హుషారైంది. తనకు తల్లి లేదని నాన్న స్వయంగా పెంచాడని, నాన్న చెప్పినట్టే వినాలని ఆమె అనుకొనేది. నాన్నకు ముందు లాగా ఆమె శ్రమ యివ్వడం లేదు. తాను బువ్వ చేయడం నేర్చుకొన్నది గనుక ఉదయం అన్నం వండి నాన్నకు పెట్టి ఆయన వెళ్ళిన వెనుక బడికి వెడుతున్నది. బడిలో కూడా తానంటే అక్కడి మాస్టార్లకు ఎంతో యిష్టం. వారికి కూడా లలిత తల్లి లేని బిడ్డ అని తెలుసు గనుక ఎక్కువ ఆదరణ చూపుతున్నారు.

ఒక దశాబ్దం ఈలాంటి జీవనమే గడిపాడు జగదీశం. అతనికి సంపద వున్నా సంపాదన కోసం గుమాస్తా వుద్యోగం చేయక తప్పలేదు. భార్య వున్నా వంట చేసుకోక అన్నమ్ముద్ద ఆకులో పడలేదు. తనను నమ్మి తన కప్పగించి వెళ్ళింది బిడ్డను వదినమ్మ. ఆ కసుకాయ నేలపడక ముందే కళ్ళు మూశాడు అన్న. ఆ బిడ్డను పోషించడానికి తన జీవితం అంకితం కావడం కంటే మహత్తర త్యాగం వేరేదీ కనుపించలేదతనికి. అందుకే ఎన్ని సంవత్సరాలైనా ఆమెను ఒక యిల్లాలుగా చేసి చావాలని, అంతవరకూ బ్రతకాలని భగవంతుని ప్రార్థించుకొనే వాడు జగదీశం.

జగదీశం ముందులాగా లేదు. అతనిలో యౌవనం తిరిగిపోయింది. కండలు కరిగిపోయాయి. వెంట్రుకలు సగానికి పైగా తెల్లబడినై. ఒక్కొక్కసారి

తన శారీరక వాతావరణాన్ని చూచుకొని ముందుగా లలితకు పెళ్ళి చేయాలని అనుకొనేవాడు జగదీశం. ఓనాడు తన అభిప్రాయాన్ని కూడా ఆమెతో చెప్పాడు. అన్నీ నాన్నే చూచుకొంటున్నపుడు పెళ్ళి విషయంలో కూడా మీయిష్టం అన్నది లలిత.

అమ్మాయి స్కూల్ ఫైనల్ వరకూ చదువుకొన్నది. కట్నం కూడా కొద్ది ముడుతుందని తెలుసు. అందులోనూ లలిత లావణ్యం అందరికీ లేదు. ఆమె కనుపాపల్లో క్రొత్త వెలుగులు, ఆమె పాలబుగ్గల్లో బంగారు మెరుగులు, చూచి వారికి ఆకర్షణ అయస్కాంతమై పోతున్నది.

అమ్మాయి బాగున్నది.... పైగా చదువుకున్నది. గనుక కట్నం యిచ్చినా యివ్వకున్నా నేను చేసుకుంటా నంటూ ముందుకు వచ్చాడు మహేశ్వర్. మహేశ్వర్ చురుకైన వాడే. డాక్టర్ పరీక్ష ప్యాసు చేసి క్రొత్తగా ప్రాక్టీసు పెట్టాడు. జాతకం మంచిదే అన్నారు శాస్త్రులు గూడా. పేరు ఫలాలు పొంతనాలు బావుంటేనే గాని జగదీశం అంగీకరించడు. అదృష్టవశాత్తు అవన్నీ గూడా సరిగానే వచ్చాయి. లగ్నం కూడా నిశ్చయించారు.

కుమార్తెకు పెళ్ళి చేయడానికి నెల రోజులు సెలవు పెట్టాడు జగదీశం. కావలసిన సన్నాహాలన్నీ పూర్తి చేశాడు. అద్దె యిల్లయినా అలంకరణ కేమీ లోటు చేయలేదు. ఇక కుమార్తెకు కావలసిన ఆభరణాలన్నీ స్వంతంగా చేయించాడు. చిన్నా పెద్దా లేరు గనుక ముందు వెనుకలన్నీ తనమీదే పడింది. అల్లుడికి పెట్టవలసిన బట్టల నుండి అత్తవారింటికి పంపవలసిన అత్తిరసాల హండాల వరకూ తన పెళ్ళిని గమనానికి తెచ్చుకొని సమకూర్చి పెట్టాడు. ఈ సమయంలో కనీసం సీతి అయినా వుంటే బాగుండు ననుకున్నాడు గానీ ఆ వీలు లేదుగా. పెళ్ళి చీరె కొంటూంటే తన కూతురు భాగ్యం గమనానికి వచ్చింది. ఈపాటికి ఆ పాప కూడా పెళ్ళికి ఎదిగి వుంటుందేమో! ఎలా వుంటుందో చూడడానికి? అసలు పెళ్ళి అయిపోయిందేమో.... అంటూ ఆలోచనలు తెరలు వేసుకొంటూ వుంటే లలిత పలకరించింది. దిగ్గున యిటు తిరిగి లలితను చూచాడు. కళ్ళలో జలజలమంటూ నీళ్ళు రాలుతుంటే, "అమ్మ లేకుంటే ఏం నాయనా... నేనున్నానుగా" అన్నది లలిత. పిచ్చిపిల్ల. ఎవరు నాయనో... ఎవరు అమ్మో... ఆమెకేం తెలుసు?

కావలసిన చీరలు వగైరా కొనుక్కొని యింటికి వెళ్ళారు తండ్రీ కూతుళ్ళు

యిద్దరూ.

ఈలోగా ఇంటివద్ద పెళ్ళికొడుకు నాయన కాచుక్కూచున్నాడు. కట్నం పదివేలైనా లేకుంటే వ్యవహారం తెగదన్నాడు. “అఁ... పదివేలేమిటండీ.... అసలు నా ఆస్తి నలభైవేలున్నది. అది ఆమె పేరిటే వ్రాసి వుంచాను. మీరు వెంటనే స్వాధీనం కూడా చేసుకోవచ్చు” అని పత్రాలు తెచ్చి చూపెట్టాడు. అతడు సంతోషంతో “క్షమించాలి, మాటవరుసకు అడిగాను అంతే” అన్నాడు.

పెళ్ళి అయిపోయింది. ఆ మరుసటివారమే మహేశ్వర్ తన మనుష్యులను పంపి జగదీశం ఆస్తిని స్వాధీనం చేసుకొన్నాడు. ఆ పొలాలు అన్నీ ఐదేళ్ళ కౌలుకు యిచ్చి అగ్రిమెంట్లు వ్రాయించుకొని వచ్చాడు మహేశ్వర్ ఏజెంటు.

జగదీశం రుగ్మతతో మంచం పట్టాడు. లలితకు పెళ్ళి చేసి తన బాధ్యతను తీర్చుకొన్నాడు. ఆమెకు ఆస్తిని అప్పజెప్పి తన ధర్మాన్ని నెరవేర్చుకొన్నాడు. అయినా యింకొ కొరత వున్నది. తన బిడ్డ ఏమైందో తెలియదు. నిజానికి ఆమెకు ఆస్తి లేకున్నా బ్రతుకగలదు. ఇంతవరకూ మొత్తం ఆస్తిని ఆమె అనుభవించింది. ఇక మీద లలిత అనుభవించడం న్యాయం. అయినా కష్టాలు వచ్చేటప్పుడు ఆదుకొనే వారు లేరు. తాను కన్ను మూస్తే ఈ యిద్దరు బిడ్డలూ ఒకరికొకరు సాయం చేసుకునే అవకాశం లేకపోతే కష్టం. ఇక తాను బ్రతకడం దుర్లభమని గూడా డాక్టర్లు చెబుతున్నారు... ఏం చేయాలి? అని ఆలోచించాడు. కాగితం తీసుకొచ్చి కలం పట్టడానికి చేతులు వణుకుతుంటే నాలుగు ముక్కలు వ్రాసి దిండుక్రింద వుంచాడు. ఆ మూడోరోజు జగదీశం ఈ జగత్తు నుండి దూరమై పోయాడు.

తండ్రి చావు లలిత గుండెలను బ్రద్దలు చేసింది. కన్నీటితో కాగితం ముక్క ఎత్తి చదువుకొన్నది!

అమ్మా!

లలితా! నేను మీ నాన్నను కానమ్మా. మీ చిన్నాన్నను. మీ నాన్న, నీవు మీ అమ్మ కడుపులో వుండగానే మరణించాడు. మీ అమ్మ నీవు పుట్టిన వెనుక మరణించింది. నేను మీ పినతల్లి సాధింపులకు తట్టుకోలేక నిన్ను పెంచడానికి యిల్లు విడిచి వచ్చాను. చివరికి పెళ్ళి చేశాను. మీ నాన్నగారి ఆస్తితో పాటు నా ఆస్తిని కూడా నీకే వ్రాసి యిచ్చాను. నా బాధ్యత తీరిపోయింది. కాని ఒక విషయం మరిచిపోవద్దమ్మా! నీ చెల్లెలు ఇంకో అమ్మాయి వుంది. ఆమెకెప్పుడైనా

కష్టం సంభవించినపుడు నీవు తప్పక ఆదుకోవాలి.

సెలవు.

మీనాన్న

జగదీశం

ఈ లేఖ చదివేలోగా లలిత హృదయం ద్రవించి పోయింది. ఆశ్చర్యంతో మిళితమైన శోకం ఆమెను దహించి వేసింది. నాన్న నిజంగా నాన్నే... ఆయన చిన్నాన్న అయినా నాన్నే... "నాన్నా... నాన్నా..." అంటూ గట్టిగా విలపించింది. ఆ ఏడుపులో ప్రకృతి కరిగి ప్రవహించింది... దహన సంస్కారాలు ముగిసిందే లలిత బయలు దేరింది స్వగ్రామానికి. తన చెల్లెలను కలుసుకోవాలని కొండంత ఆశ పెట్టుకొన్నది. ఈ ఆశ కొనసాగే అవకాశం మాత్రం కనుపించలేదు పాపం! గ్రామం సరిహద్దులకు వెళ్ళగానే సుభద్ర చనిపోయిందని తెలిసింది. భాగ్యం ఎక్కడికి వెళ్ళిందో తెలియదని గూడా చెప్పారు. లలిత హృదయం తరిగివేసి నట్లయిపోయింది. తన చెల్లెలను కలుసుకొని తనివిదీరా కౌగలించుకొని, చిన్నాన్న జీవితంలోని త్యాగాన్ని వినిపించాలనుకొన్నది. కాని కథ అడ్డు తిరిగింది.

* * *

అసలు లలితకు పెళ్ళిఅయిన మరుసటి నెలలోనే జగదీశం ఆస్తిని స్వాధీనం చేయించుకొన్నాడు మహేశ్వర్. మనిషి చాలా స్వార్థపరుడు గూడా. అత్తింటి సొమ్ము గనుక అల్లుడు పేరు సార్థకం గావాలి కనుక ముందుగానే హుషారు పడ్డాడు. లలిత నెమ్మదిగా వున్నా ఏజెంటును పంపి ఇల్లు వాకిలి కూడా తన వశం చేసుకున్నాడు గదా! ఇంటిలో కాపురం వున్నది తన చెల్లెలేనని, ఆ యిల్లాలు తన పినతల్లే అని లలితకు తెలియదు గనుక వ్యవహారం మామూలు గానే జరిగిపోయిందపుడు.

పాపం సుభద్ర నీటిలో నుండి బయటపడ్డ చేపలాగా పక్షం రోజులకే ఎండి పోయింది. ఆ దెబ్బతో పట్టిన మంచం స్మశానానికి దారి తీసింది. తల్లిపోయిన దుఃఖానికి తోడు తలదాచుకోవడానికి నీడ లేకపోవడంతో భాగ్యం దౌర్భాగ్యం చెప్పతరం కాకపోయింది. అన్నీ సరిగా వున్నప్పుడు అల్లుడు కావడానికి సిద్ధపడ్డ మేనమామ కొడుకు సంపద దూరమైందే చడి చప్పుడు లేకుండా జారుకున్నాడు.

ఇక ఆదరించే దిక్కు ఎక్కడా కనుపించకపోవడంతో భాగ్యం భవిష్యత్తులో పెద్ద ప్రశ్న గుర్తు మిగిలిపోయింది.

పౌరుషాలతో బ్రతికిన బ్రతుకు గనుక సరివారిలో నిలువనీడలేక, ఉండటానికి యిల్లులేక, తినడానికి మెతుకులేక ఆ ఊళ్ళో గడపడం దుర్భర మనిపించింది. ఆమె చేతిలో ఉన్న రెండు బంగారు గాజులను తెగనమ్మి వచ్చిన అరవై రూపాయలు కుంచెలో దాచుకొని జీవయాత్రకు బయలుదేరింది.

ఆ పొలాలు, ఆ ఇల్లూ, ఆ తోటా చుట్టి చూచిన లలిత నాలుగు కన్నీటి చుక్కలు విడిచి మళ్ళీ ఎప్పుడైనా వస్తే తన వద్దకు రమ్మని తన చిరునామా యిచ్చి యిల్లు చేరుకొన్నది.

"ఎంత వెదికినా కనిపించలేదండీ. ఆ చుట్టుపట్ల కూడా జాడలేదు. మేనమామ వద్ద గూడా లేదే" అని భర్తకు చెబితే "ఏమో ఏమైందోలే" అని నాలుక చప్పరించాడు మహేశ్వర్. ఇక వెదకడంలో లాభం లేదని హెచ్చరించాడు గూడా!

* * *

ఓనాడు లలిత విచారంగా కూర్చుని వుంటే "ఎందుకక్కయ్యా అలా వున్నారు?" అంటూ ప్రశ్నించింది దాసీ పిల్ల. పేరు దాసిదైనా ఆమెను చెల్లెలు కంటే ఆప్యాయంగా చూచుకుంటున్నది. లలిత పెళ్ళి అయిన నాటినుండీ ఆ దాసీ పిల్ల లలిత వద్దనే వున్నది. జగదీశం మంచం పట్టినపుడు లలిత కంటే శ్రద్ధగా అతనికి పరిచర్యలు చేసింది. ఒక్క మహేశ్వర్ మాత్రం దాసీదనే భావంతో మెలగేవాడు. దానికెందుకంత చనువు యిస్తున్నావని గూడా ఒకటి రెండు సార్లు మందలించాడు. అయినా లలిత ఆమెను ఎప్పటిలాగానే చూచుకుంటూ వుంది. ఆ దినం విచారంగా వున్న తనను చూచి ప్రశ్నించినపుడు ఏముంది చెల్లీ... నీలాగా ఎక్కడుందో నా చిట్టి చెల్లి అంటూ కన్నీరు విడిచింది లలిత. విషయాన్ని కూడా చెప్పింది. ఆ మాటలు వింటుండగానే, దాసీ పిల్లకు పట్టరాని దుఃఖం వచ్చింది. ఇక అణచుకోలేక "అక్కా" అంటూ లలితను కౌగిలించుకొన్నది. అంతా దైవ నిర్ణయం అనుకొని సంతృప్తి పడ్డారు అక్కా చెల్లెళ్ళు. భాగ్యం ఎన్ని ఎన్ని కష్టాలు పడిందో గాని అక్కదగ్గరే దాసీ పిల్లగా చేరడం అదృష్టమనే చెప్పాలి.

తండ్రికి దాసిగానైనా పరిచర్య చేసే భాగ్యం కలిగినందుకు ఆనందపడింది. అమాయకత్వంలో తల్లి చేసిన అపచారాన్ని తలంచుకొని చింతించింది.

పరిచారిక భాగ్యం అని తెలిసిందే మహేశ్వర్ ఆశ్చర్యపడ్డాడు. అసలు బ్రతికి వుంటుందని అతడు అనుకోలేదు. ఇపుడు భాగ్యాన్ని చూస్తే మహేశ్వర్‌కు పట్టరాని కోపం. దాసీగా పనిచేసిన దౌర్భాగ్యపు మనిషి మరదలంటే ఎంత లోకువ? ఈ లోకువతో పాటు రేపు లలిత ఆస్తిలో అర్ధభాగం గుంజుకొంటుంది కాబోలని అతడి ఈర్ష్య. ఈ దూరదృష్టితో మహేశ్వర్ భాగ్యాన్ని మరదలుగా భావించలేదు. ఆమెను దాసీ పిల్ల కంటే హేయంగా చూడడం ప్రారంభించాడు మీరలా చూడ్డం భావ్యం కాదని, భాగ్యం నా స్వంత చెల్లేనని, ఆమె తండ్రిగారి ధర్మాన్నే తాను పెరిగి పెద్దదైనానని, అసలు ఆమె సొమ్ము వల్లనే మనం కూడు తింటున్నామని గూడా హితబోధ చేసింది భర్తకు లలిత. కాని ఈ బోధన అంతా బూడిదలో పోసిన పన్నీరై పోయింది.

రాను రాను అతని ప్రవర్తన అసహ్యమై పోతుంటే దేనికైనా త్వరగా భాగ్యానికి పెళ్ళి చేయడం మంచిదని నిశ్చయించుకొన్నది లలిత. అక్కడా యిక్కడా ఆచూకీ తీసి చివరికి ఓ సంబంధాన్ని స్థిరం చేసుకొన్నది. లగ్నం నిశ్చయించుకోవడానికి వరుని పక్షం వాళ్ళు యింటికి వచ్చారు. మాటా మాటా సందర్భంలో కట్నాల విషయం గూడా ప్రస్తావనలో పడింది. కట్నానికేం కొదువ? ఇరవైవేల రూపాయల ఆస్తి యిస్తామని లలిత చెప్పింది. "ఎక్కడిదీ?" అని ఎదురు ప్రశ్న వేశాడు మహేశ్వర్. "మా చిన్నాన్న గారు నా పేరిట వ్రాసిన నలభై వేల రూపాయల ఆస్తిలోనూ అర్ధభాగం ఆమె సొమ్మే గదా? ఆ బిడ్డ సొమ్మే గదా ఆమె కిస్తున్నాము. మన సొమ్మేమీ లేదే" అన్నది లలిత. "ఈ ధర్మ శాస్త్రాలు చదివితే వినడానికెవ్వరూ సిద్ధంగా లేరు. ఆ సొమ్ము నుండి ఒక్క పైసా కూడా యివ్వడానికి వీల్లేదు. కట్నాలు లేవు కానుకలూ లేవు. ఇష్టం వుంటే చేసుకోవచ్చు లేకుంటే మా రాజుగా వెళ్ళవచ్చు" అంటూ కూర్చున్న చోటు నుండి లేచి వెళ్ళిపోయాడు మహేశ్వర్. వెంటనే లలిత వెళ్ళి కాళ్లా వేళ్ళా బ్రతిమలాడింది. తుదకు కన్నీటితో ప్రాధేయ పడింది. తనకోసం కన్నబిడ్డను, కట్టుకున్న భార్యను కూడా విడిచి పెట్టిన చిన్నాన్న గారికి యింత ద్రోహం చేయడం పాడిగాదని ఎంత బ్రతిమలాడుకున్నా ఫలితం లేకపోయింది. ఈ గొడవను చూచిన వరుని పక్షం వారు సందడి లేకుండా జారుకున్నారు.

లలిత పడుతున్న వేదనను చూచి భాగ్యం "నాకు పెళ్ళి ఎందుకక్కా ఇలాగే నీకూ బావకు పరిచర్య చేసుకుంటూ వుండిపోతా" నన్నది. ఈ పలుకులు విన్న లలిత చెల్లెలను గుండెకు హత్తుకొని బోరుమని విలపించింది. ఎంత విలపించినా, మరెంత రోదించినా మహేశ్వరం గుండె కరుగలేదు. అతడు పదహారణాలా అల్లుడు. అత్తింటి సొమ్ము పట్ల తనకున్న అధికారం ఎంత మహత్తరమైందో అతనికి తెలుసు. అతడు నవగ్రహాలను మించిన దశమ గ్రహం. ఒక్క మాసం రోజులుగా వరుసగా బ్రతిమలాడినా అతనిలో రవ్వంతైనా మార్పు రాలేదు. చివరికి నాలుగింట ఒక భాగమైనా ఆ దిక్కులేని పిల్లకు ముట్టచెప్పాలని లలిత శతవిధాలా ప్రయత్నించింది. ఈ ప్రయత్నమూ విఫలమైంది. ఫలితంగా మహేశ్వర్ తనతో సరిగా పలకడం కూడా మానుకున్నాడు.

* * *

ఓనాడు ఉదయం పది గంటలకు లలిత భాగ్యానికి పెళ్ళి చీరెను కట్టబెట్టింది. చిన్న సూట్‌కేస్ తీసుకొని దారిలో వెడుతున్న బండిని పిలిచింది. "ఎక్కడికే" అంటున్నా వినిపించుకోక సరాసరి స్టేషన్ వైపు తీసుకెళ్ళింది. రిజిస్ట్రాఫీసుకు వెళ్ళేవరకు భాగ్యానికి విషయం బోధ పడలేదు. వరుడు ముందు కుదిర్చినతనే. ఉద్యోగం కూడా వుంది. దాంపత్యం బాగానే కుదిరింది. రిజిస్టర్ మారేజికి ముందు గానే తాను మొత్తం ఆస్తిని లలిత పేరిట వ్రాయించి రిజిస్టర్ చేయించిన పత్రాలను కూడా వధువు చేతిలో పెట్టింది. ఇద్దరినీ పిలుచుకొని వరుని స్వగృహానికి వెళ్ళి వారం రోజులుండి సెలవు తీసుకొని వెళ్ళిపోయింది.

* * *

"అక్కయ్య వెళ్ళి రెండు వారాలైందే... జాబు గూడా వ్రాయలేదే. బావ ఏమన్నాడో ఏం జరిగిందో!" అని భాగ్యం చింతపడుతుంటే, భర్త చంద్రశేఖరం ఎందుకు వస్తాయి పేచీలని వివరాలు అడిగాడు. భాగ్యం వరుసగా అక్క బావల మధ్య చిక్కులను గురించి చెప్పింది. చంద్రశేఖరం మహేశ్వర్ లాంటి వాడు గాదు. పెద్దవాళ్ళ బలవంతం కొద్దీ కట్నాల విషయంలో కల్పించుకోలేదు గాని అత్తింటి

సొమ్మంటే అతనికి మమకారం లేదు. కష్టపడి సంపాదించి తాను అనుభవించి, యితరులకు పెట్టాలిగాని అమాంతంగా వచ్చే కుక్క తిండికి ఆశపడే వాడు కాదు. "ఐతే ఒక పని చేద్దామా?" అన్నాడు. ఏమిటని అడిగింది భాగ్యం ఆతురతగా. "ఈ ఆస్తినంతా మళ్ళీ అక్కయ్య పేరిటనే వ్రాసిపెడితే ఏ పేచీలూ వుండవు. మనకేం ఆస్తిలేకున్నా అన్యోన్యత వున్నది. పాపం! ఆమె బ్రతుకు చెడిపోగూడ" దన్నాడు. భాగ్యం క్షణం ఆలోచించి "మొత్తం ఆస్తి వ్రాస్తే మీ వాళ్లు మళ్ళీ పేచీ పెట్టవచ్చు. సగం వ్రాస్తే ఏ పేచీ వుండదు. వారికీ వీరికీ సంతృప్తిగా కూడా వుంటుంది" అన్నది భాగ్యం. మరునాడే చంద్రశేఖరం భాగ్యాన్ని రిజిస్ట్రరాఫీసుకు తీసుకొని వెళ్ళి సగం ఆస్తిని లలిత పేర వ్రాయించాడు. ఆ మూడో రోజే పత్రాలు తీసుకొని ఆలూమగళ్ళిద్దరూ లలిత యింటికి బయలుదేరారు. ఇంతటితో కష్టాలు గట్టెక్కాయి గదా అనుకొని భాగ్యం ఉవ్విళ్ళూరుతూ అక్కయ్య యింటిలో ప్రవేశించింది.

ఇల్లు వున్నది. గాని అందులో యిల్లాలు లేదు. లలిత ఆ రోజు వెళ్ళింది మళ్ళీ యింటి వైపు చూడనేలేదట. "ఎక్కడ బావా అక్కయ్య?" అని భాగ్యం అడుగుతుంటే మహేశ్వర్ స్తంభంలాగా నిల్చున్నాడు. భాగ్యంతో పాటు చంద్రశేఖరం ఎంత ప్రయత్నించినా లలిత జాడ కనుపించనే లేదు.